క్లుప్తంగా

మోటార్‌లోని రాగి వైరు చోరీ



పగులగొట్టి ఉన్న మోటార్

మనుబోలు : మనుబోలు పడమర డొంకలో ఆదివారం రాత్రి ఓ విద్యుత్ మోటార్‌లోని రాగి వైరు చోరీకి గురైంది. చింతల అమర్నాథ్ పొలాన్ని పచ్చిపాల రామిరెడ్డి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పొలానికి నీటి సరఫరా నిమిత్తం విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేయగా దానిని పగులగొట్టి రాగి వైరును చోరీ చేశారు. దీంతో తనకు రూ.30 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు రామిరెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో మనుబోలులో కరెంటు మోటార్ల చోరీ తరచూ జరుగుతోందని, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ



మనుబోలు : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా వెంకన్నపాళెం గ్రామానికి చెందిన వల్లం రమేష్ సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన కుమారుడు చింటూ జ్ఞాపకార్థం యాచకులు, గిరిజనులు, వికలాంగులకు దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. ఆయన వెంట వీఆర్వో మురళీధర్, వీఆర్‌ఏ శంకర్, జగదీష్, రాగేష్ ఉన్నారు.

పడుగుపాడులో ఫ్యామిలీ డాక్టర్



వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్ నిరంజన్

కోవూరు : మండలంలోని పడుగుపాడు సచివాలయం-1 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ పలువురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వృద్ధులు మందుల వాడకంలో నిర్లక్ష్యం చూపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న హిరోకి

మనుబోలు : రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నచినో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జీఎం హిరోకి అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని రవి ఫర్టిలైజర్స్ కేంద్రంలో పంటల సాగు, తెగుళ్ల తదితరాలపై సోమవారం రాత్రి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైరు మధ్య దశలో దోమపోటు, మెడ విరుపు, అగ్గి తెగులు ఆశిస్తుందన్నారు. వీటి వల్ల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వీటిని ఆర్కెస్ట్రా, అభూచి, డ్యూయెట్ మందులతో నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో దామిశెట్టి రంగారావు, కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, లెనిన్‌బాబు ఉన్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి



మృతిచెందిన పెంచలయ్య

మనుబోలు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా కోట గ్రామానికి చెందిన మంద పెంచలయ్య(70) మండలంలోని బద్దెవోలు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా కొలనకుదురు నుంచి గూడూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో పెంచలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మొదట గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో నెల్లూరు డీఎస్సార్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

జైశ్రీరామ్.. జైశ్రీరామ్



వెంకటాచలం : స్వర్ణభారత్ ట్రస్టులో సీతారాముల కల్యాణం



విడవలూరు: సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



పొదలకూరు : వేడుకగా సాగుతున్న సీతారాముల శోభాయాత్ర

- వైభవంగా రాములోరి శోభాయాత్ర
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు

పొదలకూరు : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పొదలకూరు పట్టణంలో నిర్వహించిన శోభాయాత్ర సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక గేటుసెంటరు నుంచి శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు నిర్వహించిన యాత్రలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో ఓలలాడారు. దారి పొడవునా ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. యువతీ, యువకులు రామనామస్మరణ చేస్తూ జైశ్రీరామ్ అంటూ భజనలు, సంకీర్తనలు చేశారు. ఉత్సవ విగ్రహాలను భక్తులు కొబ్బరికాయలు సమర్పించారు. ఆధ్యాత్మిక సంఘాల వారు యాత్రలో పాల్గొన్న వారికి ఆహార పదార్థాలు, మజ్జిగ అందజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకున్న శోభాయాత్రకు అక్షతలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థానం నిర్వాహకులు మధ్యాహ్నం అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెంద్యాల రమణయ్యనాయుడు, కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు కోనం చిన బ్రహ్మయ్య, ఎం.శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, లక్కాకుల ఆనందరావు, మద్దిరెడ్డి రమణారెడ్డి, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, మురళీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

వెంకటాచలం : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సోమవారం ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ నేతృత్వంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 వరకు వేద పండితులతో సీతారాముల కల్యాణ మహోత్సవం, రామనామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బిగ్ స్క్రీన్‌లో అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు వీక్షించారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. అనంతరం శోభాయాత్రను స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి సర్వేపల్లి క్రాస్‌రోడ్ వద్దనున్న రామాలయం వరకు నిర్వహించారు. సాయంత్రం అక్షర విద్యాలయంలో శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంగరంగ వైభవంగా..

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్టోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అర్చకులు శ్రీనివాసశర్మ, శ్రీకాంత్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

16వ వార్డులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు చెన్నూరు రోడ్డులో శ్రీరాముని భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. జనవరి 22న చరిత్రలో నిలిచిపోతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రమీలమ్మ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

రామభక్తురాలికి సన్మానం

పొదలకూరు : దశాబ్దాలుగా శ్రీరాముడిని సేవించుకుంటున్న పట్టణానికి చెందిన పులి శేషమ్మను స్థానిక రామ మందిరంలో సోమవారం సన్మానించారు. తొమ్మిది పదుల వయస్సు పైబడిన శేషమ్మ నిత్యం మందిరంలో రామాయణ పారాయం చేస్తూ సీతారాములను సేవిస్తున్నారు. కాగా అయోధ్యలో బాలరాముని ప్రతిష్ట సందర్భంగా మండల బీజేపీ నాయకులు శేషమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామమందిరం వద్ద భక్తులకు వడపప్పు, పానకం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచపూటి ధనుంజయరావు, తిప్పసాని నారాయణరెడ్డి, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, కాశీనాయన స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామనామంతో మార్మోగిన ఆలయాలు

మనుబోలు : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం మండలంలోని పలు రామాలయాలు భక్తుల రామనామ స్మరణతో మారుమోగాయి. ఆయా ఆలయాల్లో అర్చకులు సీతారాములకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అయోధ్యలో మధ్యాహ్నం 12:29 గంటలకు జరిగిన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం భక్తుల జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. మనుబోలుతో పాటు చెర్లోపల్లి, యాచవరం, కొండూరుసత్రం, పిడూరు, మడమనూరు, బండేపల్లి, ఎల్‌ఎస్‌పురం, కాగితాలపూరు, గురివిందపూడి, కొమ్మలపూడి, వెంకన్నపాళెం, పిడూరుపాళెం, బద్దెవోలు, కట్టువపల్లి, కొలనకుదురు, అక్కంపేట, వీరంపల్లి, వడ్లపూడి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు రామనామం జపించారు.

కోదండరామస్వామి ఆలయంలో..

కోవూరు : స్థానిక గాంధీ పార్కు సెంటర్‌లో ఉన్న కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జైశ్రీరామ్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ ఆకట్టుకుంది. అనంతరం ఆర్యవైశ్య మహిళలతో కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అయోధ్య బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని భారీ స్క్రీన్‌లో భక్తులు వీక్షించారు. మధ్యాహ్నం ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో భక్తుల కోలాహలం

ఇందుకూరుపేట : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో కోలాహలం నెలకొంది. ప్రతిష్ట గడియల్లో బాణసంచా కాల్చి, పూజలు జరిపి తమ భక్తిని చాటుకున్నారు. మైపాడు రామాలయంలో ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి పూజలు చేశారు. అనంతరం మైపాడు నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించి జైశ్రీరామ్ నినాదాలతో అన్ని గ్రామాలను చుట్టి వచ్చారు.



కోవూరు : కర సేవకులకు సన్మానం



ఇందుకూరుపేట : మైపాడులో బైక్ ర్యాలీ

కర సేవకులకు సన్మానం

కోవూరు : అయోధ్య రామ మందిరం కోసం 1990-92 సంవత్సరాల్లో కరసేవలో పాల్గొన్న సేవకులకు వేగూరులోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సన్మానించారు. రామమందిర నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో శాలువ కప్పి మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రమేష్, రిటైర్డ్ హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, కరసేవకులు జెట్టి వేణుగోపాల్‌రెడ్డి, దేవరం శ్రీకర్ రెడ్డి, గల్లా సుధాకర్, సుబ్బయ్య, దాసరి సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.



కోవూరు : రామ మందిరంలో కోలాటం చేస్తున్న మహిళలు



పొదలకూరు : రామభక్తురాలు శేషమ్మకు సన్మానం



మనుబోలు రామాలయంలో రామనామం జపిస్తున్న భక్తులు

కులగణనతో ఉపయోగం



కొడవలూరులో జరుగుతున్న కులగణనను పరిశీలిస్తున్న ఎంఈఓ



కోవూరు : కులగణనను పరిశీలిస్తున్న ఎంఈఓ రహీమ్

- ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు : కులగణనతో ప్రజలందరికీ ప్రయోజనకరమని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. కొడవలూరులో జరుగుతున్న కులగణనను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులగణన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొప్ప కార్యక్రమం అని తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో కులాల వారీగా జనసంఖ్యను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. తద్వారా ప్రభుత్వ పథకాలను అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ప్రజలు సహకరించాలి

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంఈఓ రహీమ్ కోరారు. కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ సచివాలయ పరిధిలో జరుగుతున్న కులగణన కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులగణన వల్ల ప్రజల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు కూడా తయారు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఎటువంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం : హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరుగనున్న నేషనల్ అడ్వెంచర్ క్యాంపునకు వీఎస్‌యూకు చెందిన 10 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో పాటు ఒక ప్రోగ్రామ్ అధికారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని వీఎస్‌యూలో వైస్ చాన్స్‌లర్ సుందరవల్లి సోమవారం అభినందించారు. ఈ క్యాంపులో ఉత్సాహంగా పాల్గొని, వీఎస్‌యూకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారి నాహిద్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవాలయంలో పూజలు

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద జైశ్రీరా మ్ అని అక్షరమాలతో దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకుడు తులసీరామ్ స్వామి భక్తులకు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముంగర పద్మావతమ్మ, బత్తిన శైలజమ్మ పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



కోవూరు : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం తిరుపతిలో కలిశారు. ఈ సందర్భంగా శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఉన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం పెన్నానది తీరాన విఘ్నేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, పరమేశ్వర స్వామి, ఇష్టకామేశ్వరి అమ్మవారి దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు గాదిరాజు భాస్కరరావు, ఎం.వెంకటేశ్వరరావు, జేఎల్ సత్యం, నలుబోలు వెంకటరమణారెడ్డి, రవి, శ్రీధర్, నాగిరెడ్డి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఎఫ్‌ఏ-3 (ఫార్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షలను నిర్వహించనున్నారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఏ-3, 9, 10 తరగతుల విద్యార్థులకు సీబీఏ-2 (క్లాస్‌రూమ్ బేస్‌డ్ అసెస్‌మెంట్) పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను ప్రభుత్వం అందజేసిన ఓఎంఆర్ షీట్లలో రాయాల్సి ఉంది. ప్రతి విద్యార్థి తప్పకుండా ఎఫ్‌ఏ-3 పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 3.20 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.

గ్రామస్తుల నుంచి అర్జీల స్వీకరణ

పొదలకూరు : మండలంలోని ఆర్‌వైపాళెంలో గ్రామస్తుల నుంచి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం అర్జీలను స్వీకరించారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను పిలిపించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాలకు వెళ్తే భారీగా అర్జీలు అందేవని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. మొత్తంగా చూసుకున్నా నాలుగైదు వినతులు కూడా అందడం లేదన్నారు. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధి పాలనకు నిదర్శనమన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

వేమన పద్యాలపై విస్తృత ప్రచారం



రేగడిచెలికలో వేమన రచనల ప్రతులతో సభ్యులు, గ్రామస్తులు

కొడవలూరు : యోగి వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని రేగడిచెలిక, బొడ్డువారిపాళెం, పెయ్యలపాళెం, సంజీవనగర్ గ్రామాల్లో వేమన పద్యాల్లోని జ్ఞానంపై సోమవారం విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రేగడిచెలికలో ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు డి.సురమౌళి మాట్లాడుతూ వేమన గొప్పతనాన్ని ప్రజలకు వివరించేలా ప్రచారం చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ వేదిక జిల్లా కమిటీ సభ్యులు శేఖర్, శ్రీదేవి, సునీల్, సుభాష్, పద్మజ, డీవీ ప్రసాద్, రాజేంద్రప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి ఆరోపణలు అవాస్తవం

- ట్రైలర్స్ అసోసియేషన్ నేతల వివరణ

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టు నుంచి కంటైనర్ టెర్మినల్ చెన్నైకి తరలిపోతోందని, దీనికి తామే కారణమంటూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరులో చేసిన ఆరోపణలు అవాస్తవమని కృష్ణపట్నం ట్రైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. ముత్తుకూరులో అసోసియేషన్ అధ్యక్షుడు గిరి, సభ్యులు శ్రీహరి, వెంకటశేషయ్య తదితరులు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కరోనా తర్వాత పోర్టుకు కంటైనర్ల నౌకలు రావడం తగ్గిపోయిందని వివరించారు. గతంలో నెలకు 5,000 కంటైనర్లు వస్తుండగా, కరోనా తర్వాత క్రమంగా కంటైనర్ల సంఖ్య వందలకు పడిపోయిందన్నారు. దీంతో కంటైనర్ల రవాణా వ్యాపారం పడిపోయిందన్నారు. కంటైనర్ల ద్వారా సరుకుల ఎగుమతి-దిగుమతులు చెన్నై కేంద్రంగా జరగడం వల్ల ఇక్కడి కంటైనర్ టెర్మినల్ తొలగిస్తారన్న ప్రచారం జరుగుతోందన్నారు. దీనికి తమ అసోసియేషన్‌ను కారణంగా చూపడం సోమిరెడ్డికి సమంజసం కాదన్నారు. టెర్మినల్ తరలిపోకుండా ఉండేందుకు అవసరమైతే తమ అసోసియేషన్‌ను రద్దు చేస్తామని ప్రకటించారు. కంటైనర్ టెర్మినల్ తరలించవద్దంటూ పోర్టు యాజమాన్యానికి వారు విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ట్రైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు